# శిష్టాలి అన్నపూర్ణ


పెద్దింటి విజయలక్ష్మి

*పగలంతా బండెడు చాకిరీతో, బోలెడన్ని సమస్యలతో, ఆర్థిక యిబ్బందులను ఏ విధంగా పరిష్కరించాలా అన్న ఎడతెగని ఆలోచనలతో అలసిపోయి, అలుపు తీర్చుకుందామని రాత్రి ఏ*

పదింటికో మంచం వాసన చూడగలిగిన అన్నపూర్ణకి, ఎంత ప్రయత్నించినా నిద్ర రావటం లేదు. జరిగిపోయిన సంఘటనలమీద తర్కించటం మొదలు పెట్టింది మెదడు. యింక నిద్ర ఎలా పడుతుంది! పగలుపడ్డ శారీరకపు బాధకన్నా, ఎందుకో ఇప్పుడు యీ మానసికా వేదన ఆమెని కృంగదీసింది. ఏ దేవుడైనా కనిపించరే, ఈ ఆలోచనా భారానికి దూరంగా వెళ్లే సుఖనిద్రనే ప్రసాదించమని కోరేది అన్నపూర్ణ. కానీ కనిపించే దేవుడెవరు!

ఇంటి స్వంతగాళ్లు, అప్పులవాళ్లు — వీళ్లే పెద్ద దేవుళ్లుగా తమ నెత్తిమీద కూర్చుని రోజుకోపది దండాలు పెట్టించుకుంటున్నారు. అంతా డబ్బుకి మనుష్యులేగాని, మానవత ఉన్న మనిషికీ, మంచి హృదయానికీ మనుషులు కారు. లేకపోతే, ప్రొద్దున యింటావిడ కనకమ్మ. ముష్టి కరేపాకు కోసం. అంత తగువు పెట్టుకుంటుందా! దాంతో యింత కాలం కలిసి మెలిసి వున్న తమ స్నేహంపై ఓ పెద్ద బండరాయిపడి, అది కాస్త రెండు ముక్కలై కూర్చుంది. వాళ్ల దొడ్లో పెరుగుతున్న కరేపాకు తాను కోసుకుంటుం న్నందుకు, రోజూ ఆ మొక్కకి తాను నీరు పట్టాలిట. ఒకరోజు ఎందుకో అవసరమొచ్చి ఎప్పుడూ అడగని స్నేహితురాలు రెండు రబ్బలు అడిగింది కదాని రెండంటె రెండు రబ్బలు కోసిచ్చింది తను. ఒకరబ్బగిల్లితేమళ్లా అక్కడ యింకోరబ్బ చిగురిస్తుంది కదా. ఏం పోయిందని కనకమ్మ గారి 'పర్మిషను' తీసుకోకుండా అలా చేయటం తననేరమైపోయింది.

"హత్తెరిగ, యింటి యజమానురాలు నేనుండగా నీవింతటి నేరమెలా చేస్తావు ? దానికి తగినశిక్ష నీవు అనుభవించాల్సిందే" అని, అనరాని మాటలని, లోపలికెళ్లి తలుపు గడియపెట్టుకుంది. ఆవిడ 'లా' ప్రకారం తాను దోషియే. ఐదు పైసలు పెడితే వచ్చే కరేపాకుకి. కాస్తలో కక్కుర్తిపడ్డ తనని తాను తిట్టుకుంది అన్నపూర్ణ. దాంతో తన "మూడ్స్" పాడైపోయింది. విచ్ఛిన్నమైన మనసులో, ఎంతో ఘుమఘుమలాడుతూ చేయాలనుకున్న పప్పుచారులో కాస్త, రెండు మార్లు వుప్పువేసి దించేసింది. దానికి ఫలితం, ఒక్కళ్లూ ఓ చెంచాడు చారుకూడ పోసుకో



లేదు. గిన్నెడు చారుపట్టుకెళ్లి దిబ్బలో పోసింది.

ఈ కలికాలంలో, రేట్లకి రెక్కలొచ్చి పైకెగసిపోతున్న తరుణంలో, అన్నీ అమరికగా చేసుకోటానికే గగనమైపోతూంది. ఇది వరకు నాలుగు ఆధరువులతో అన్నం వండుకుని, ఒక్కొక్కళ్లూ పావుశేరు బియ్యపు అన్నంతో లాగించేవాళ్లు. ఆ రోజులుపోయి, యిప్పుడు ప్రతిగిన్నెలో ఎంతవుందో, దానికి తగ్గట్టుగానే తినాలన్న నియమం ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో గిన్నెడు చారుదిబ్బలో పోసివచ్చిన అన్నపూర్ణమనసు విలవిల్లాడిపోయింది. భర్త, పిల్లలూ చారులో అంత వుప్పు వేసినందుకు విసుక్కోవటం మొదలెట్టారు. పచ్చడి, చారుచేస్తే, దాంట్లో చారు యిలాఅయిపోయి, చివరికి పచ్చడి మెతుకులలో భోజనం ముగించినందుకు వాళ్లకి తనపై గుర్రు. కాని, తాను చేయాలనా అలా చేసింది. ఎంతవాళ్లకైనా ఒక్కోసారి గురి తప్పుతుంది. అదే బయట వాళ్ల దగ్గరైతే సర్దుకుంటారుగానీ, ఇంటి ఇల్లాలు దగ్గరకొచ్చేసరికి ఆమె నెవరూ క్షమించరు. వంట చేసేటప్పుడు అంత నరధ్యాన మెందుకని చిటపటలాడుతారు. దాంతో యింటి బరువు సగానికి పైగా మోసుకొస్తున్న యిల్లాలు మనసుకి శరాఘాతం తగిలి, పరధ్యాన మరికొంత ఎక్కువై మరో తప్పు జరుగుతుంది గానీ, వేరే మోక్షముండదు. అందుకే పొరపాటుగా ఏదో తప్పు జరిగినా, దానికి క్షమాభిక్ష అనేది పెట్టరు. అంద

వలసిన ఆ సమయానికి క్షమాపణ అందకపోతే మనిషికి నిరుత్సాహం రాక తప్పదు.

మనసులో యిన్ని విధాల ఆలోచనలు పీకుతుంటే అన్నపూర్ణకి భోజనం చేయాలనిపించలేదు. వంటిల్లు సర్ది, అన్నీ మూతలు పెట్టి, యివతలికి వచ్చింది— తాను భోజనం చేయకుండానే.

ఆ రోజు మంగళవారం కాబోలు, పత్రిక కుర్రాడు వచ్చి. పుస్తకం పడేశాడు. డబ్బుల కోసం అలా నిల్చున్నాడు. అన్నపూర్ణ, ఓ అరవై పైసలకోసం. యిల్లంతా గాలించింది. కానీ లాభం లేకపోయింది. "తర్వాత రారా ఇస్తాను" అంది ఆ కుర్రాడితో. కానీ, వాడు "మా షావుకారు ఎక్కడా అరువు పెట్టవద్దన్నాడండి. ఇప్పుడే యిచ్చేయండి" అని మేకులా నుంచున్నాడు.

అన్నపూర్ణలో నిరాశ, విస్పృహ ఎక్కువై పోయింది. ఈ చిన్న అప్పు వెంటనే తీర్చుకోలేని యిల్లాలు తను. ఒక్క నిముషం తన బ్రతుకుమీద తనకే అసహ్యమేసింది. తన నిస్సహాయతకు, ఆ పత్రిక కుర్రాడిమీద మనసు భగభగ మండింది. "అక్కర్లేదు. పట్టుకెళ్లు" అని పుచ్చుకున్న పత్రిక వాడి మొహాన కొట్టి, భారమైన మనసుతో లోపలికొచ్చింది. తానిటు రాగానే, మరో నిముషానికి మళ్లా ఎవరో తలుపు తట్టారు. అసహనంగానే లేచివచ్చిన అన్నపూర్ణకి రాజమ్మ పిన్ని ప్రత్యక్షమైంది. ఆవిడనిచూడగానే, మొహం యింత చేసుకుని, "రాపిన్నీ, రా"అని తలుపు తీసింది అన్నపూర్ణ.

సంసారంలో ఎన్ని కలతలు వున్నా, మనసులో ఎంత నిరాశ పేరుకున్నా, మనిషికి "నా" అన్న వాళ్లు కనిపిస్తే ఎక్కడలేని బలం వస్తుంది. పరితప్తతతో వేగుతున్న హృదయంపై, చిరుజల్లు కురిసినట్టు హాయిగా వుంటుంది.

ఎన్నాళ్లకో, మళ్లా కనిపించిన రాజమ్మ పిన్ని రాక అన్నపూర్ణకి మహదానందం కలిగించింది.

"ఏమిటి పిన్నీ, మరీ నల్లపూసవై పోయావు ? అంతా బాగున్నారా? బాబాయి గారు వూరు నుంచి వచ్చేశారా?" మొదలగు ప్రశ్నలన్నీ, తన ఆతృతకొద్దీ ఒక్కసారే వేసేసింది. రాజమ్మ పిన్నికి కూడా, అన్నపూర్ణపై ప్రత్యేక ఆదరణ వుంది కాబట్టి, ఆమె అడిగిన దానికంతా, నవ్వుతూ సమాధానాలు యిచ్చింది.

పిన్నిని చూడగానే ప్రాణం లేచివచ్చిన అన్నపూర్ణకు, తన ఆకలి తెలియవచ్చింది.

"రా పిన్నీ, భోజనం చేద్దాం " అని, రెండు కంచాలు అందుకోబోయిన అన్నపూర్ణ,

"నేను భోజనం చేసే వచ్చానమ్మాయ్" అన్న పిన్ని సమాధానానికి చిన్నబుచ్చుకుంది.

"పోనీ, కాఫీయైనా తాగు" అంటూ. ఆమెకు కాఫీ చేసిచ్చి, తాను భోజనానికి కూర్చుంది.

తానారోజు పిన్ని పుణ్యమా అని, నాలుగు మెతుకులు మింగింది కానీ, అప్పటిదాక తన కున్న నిస్పృహకి ఆ రోజు పస్తు వుండి పోయేదే !

"పూర్ణా, మినర్వాలో 'అమ్మాయి పెళ్లి'కి వెళ్దామా ? నీకు భానుమతి అంటె యిష్టంకదూ' అంటూ, యిక తప్పకుండా బయలుదేరి తీరుతుందని. అన్నపూర్ణవైపు ఆశగా చూసింది రాజమ్మ పిన్ని.

నిజమే. భానుమతి నటన, ఆ వాక్చాతుర్యం, ఆమెపాటలు అంటె అన్నపూర్ణకి చాలాయిష్టం. కానీ, యీ సంసారంలోపడి, ఆ సాగరాన్ని ఎలా యీదుకురావాలా అన్న బెంగతో తాను సినిమాలన్నీ కట్టి పెట్టేసింది. పైగా, పిల్లలూ పెద్దవాళ్ళయ్యారు. వాళ్లూ రావాలని గొడవ. ఇంటిల్లిపాదీ వెళితే సినిమాకి రెండుపదులెగిరిపోతాయి. మన సొప్పక, తానూ సినిమాగురించి ఆలోచించటమే మానుకుంది. కానీ, యిప్పుడు పిన్ని అడగ్గానే అణచిపెట్టుకున్న కోరికని మెత్తగా కదిపినట్టైంది. వెళ్లాలనే ఆశ జనించింది. కానీ, నెలపుట్టిన పదిరోజుల్లోపుగానైతే ఫరవాలేదు. ఇప్పుడు రమ్మనిపిలుస్తోంది పిన్ని. ఇందాక పత్రిక కొనటానికే తనదగ్గర చాలినంత డబ్బులేదుకదా, యిక సినిమాకెలా బయలుదేరుతుంది ! అందుకే పిన్నికి ఏ సమాధానమూ యివ్వక మొహం వేలేసింది.

అన్నపూర్ణ యిబ్బందిని అర్థం చేసుకుంది రాజమ్మపిన్ని. "ఏమిటే డబ్బుగురించి ఆలోచిస్తున్నావా ? నేనిస్తారా పెద్దాడికి వుద్యోగం వచ్చింది. 'సినిమాకెళ్లమ్మా' అంటూ చేతిలో పది రూపాయలు పెట్టాడు అని చేతిలో వున్న చిన్నపర్సులో, అన్నిమడతలూ మడచబడ్డ, పదిరూపాయలనోటుని బయటికి లాగి చూపించింది పిన్ని.

## తల్లులారా!
## బహుపరాక్!!

పిల్లల్ని ఎక్కడా తిరగనీయకుండా. తిండీ తిప్పలు సరిగా చూడకుండా ఇంట్లోనే ఉంచినట్లయితే, అటువంటి పిల్లలలో తెలివితేటలు వృద్ధికావని పరిశోధకులు అంటున్నారు. పిల్లల శరీరంలోని హార్మోన్ల పెంపుమీద పరిసరాల ప్రభావం హెచ్చుగా ఉంటుందట. పిల్లల్ని మాటి మాటికి తిట్టడం కూడా మంచిది కాదు. అయితే, ఇటువంటి పరిస్థితులవల్ల పెంపు తగ్గిన పిల్లలను బాగుచేయవచ్చునని జాన్స్ హాప్కిన్స్ యూనివర్సిటీ వైద్య విద్యాలయ ఆచార్యులు డా. జాన్ మనీ అంటున్నారు. ఇటువంటి పిల్లల్ని కొన్నాళ్లు స్వేచ్ఛగా వదిలివేస్తే వాటిలో త్వరగా ఈ లోపాలన్నీ తీరతాయని ఈయన అంటారు. ఇది చాలా త్వరగా కూడా జరగటం కద్దు అని అంటున్నారు! ప్రయత్నం చేస్తే పోలేదా ?

ఇకనే, అన్నపూర్ణ ఆ నిముషంలో వూహాసౌధాల్లో విహరించేసింది. సినిమా యేమో తన కిష్టమైన భానుమతి నటించింది డబ్బేమో పిన్ని యిస్తోంది. ఇక ఏ ఆలోచనా అక్కర లేదు. బయలుదేరవలసిందే. పిల్లలు సాయంత్రం బళ్లోనుంచి వచ్చినా, ఒక గంట అటు యిటు ఆడుకుంటుంటే, అంతలో తాను రానే వచ్చేస్తుంది. అనుకుని పిన్నివెంట బయలుదేరింది అన్నపూర్ణ.

సినిమానుంచి వచ్చేసరికి అరుగుమీద మూలుగుతూ పడుకున్నాడు నానిగాడు. వాణ్ణి చూడగానే తనగుండె గతుక్కుమంది.

"ఏంట్రానాన్న, ఏమిటలా మూలుగుతున్నావు ?" అంటూ వాడినుదురు ముట్టుకుంది. వేళ్లు చురుమన్నాయి. తనహృదయం ద్రవించింది.

"ఎంతసేపైందిరా నీవొచ్చి? ఇంత జ్వరమెలా వచ్చింది ?" అంటూ తలుపుతీసింది.

'దారానికి చిక్కులాగ దారికి గతుకులాగ' ఆమె మెదడులో సమస్యలు బయలుదేరి, సినిమాచూసొచ్చిన సంబరమంతా పటాపంచలై పోయింది.

జ్వరంతో యింటికిం గానే అమ్మ...

అజీర్ణం
వల్ల మీరు
భయపడుతున్నారా?
హ్యూలెట్స్
మిక్స్చర్
తీసుకొని –
తిరిగి తినడం
ప్రారంభించండి


సి. జె. హ్యూలెట్ & సన్
(ఇండియా) ప్రైవేట్
లిమిటెడ్
మద్రాసు 600 002,
కలకత్తా 700 001
SAA/CJH/1191

దేహపుష్టికి
ఆరోగ్యానికి
పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
1898 నుండి ప్రసిద్ధి గాంచినది
ఆయుర్వేదాశ్రమం
(ప్రైవేట్) లిమిటెడ్
మదరాసు. 17.

దైవ దర్శనం
అసలైన దైవ రహస్యాలు తెలుసుకోకుండా రోజూ దైవపూజ చేస్తే ఫలితం లేకపోగా, మానవ రాశికి కీడు కలుగుతుంది. దైవాన్ని పొందిన వారెందరో వారి ప్రియ శిష్యులకు చెప్పిన అనేక దైవ రహస్యాలు "దైవదర్శిని" పుస్తకంలో ఉన్నాయి. అవి తెలుసుకొని మీ భక్తి శ్రమలకు తగ్గ ఫలితాలతో మీ బాధల విముక్తి పొందండి. మూర్తి రచన. ధర రూ 10/. పోస్టేజి రూ 2/. దేశసేవ. ఏలూరు-2 అంధ్రకు వ్రాస్తే మీకో పుస్తకం వి.పి. పోస్టులో పంపుతాము.

మీ బిడ్డ సంతోషంగా ఉండాలంటే


అమృతాంజన్
గ్రైప్ మిక్స్చర్ ఇవ్వండి
OBM.2640 TG
బిడ్డ ఆపకుండా ఏడుస్తూ ఉంటే జీర్ణశక్తి బాగా లేదేమో! పాపకి అమృతాంజన్ లిమిటెడ్ వారి గ్రైప్ మిక్స్చర్ ఇవ్వండి. కడుపునొప్పి, వాయువు, అజీర్ణం వల్లవచ్చే కాలంలో ఇబ్బందులు త్వరగా తగ్గిపోతాయి. బిడ్డ ఇంకా సంతోషంగా ఉంటుంది.
అమృతాంజన్ లిమిటెడ్

## ఇల్లాలు—అన్నపూర్ణ

లేకుండా తలుపుకి తాళం పెట్టి ఎక్కడికో వెళ్ళిందని, ఆ జ్వరంలో కూడ నానిగాడికి అమ్మమీద కోపమొచ్చి చిటపటలాడాడు. దాంతో, తనలాంటి మధ్యతరగతి కుటుంబీకురాలికీ, నలుగురుపిల్లలున్న తల్లికీ, యీ సినిమా వ్యామోహం ఎందుకని తనని తాను తిట్టుకోకుండా వుండలేకపోయిందిఅన్నపూర్ణ.

వెంటనే బాబుని. డాక్టరుదగ్గరకు తీసుకెళ్ళాలంటే, ఆయనఫీజు మాట తర్వాత చూసుకున్నా, రాసిచ్చినమందులు కొనటానికైనా తనదగ్గర యిప్పుడు డబ్బుల్లేవు. ఫణ కమ్మగార్ని చేబదులుఅడిగి పుచ్చుకుందామా అని తోచింది ఒక్కనిముషం. మళ్ళా 'ఛీ ఛీ, పొద్దున్నే తగవు పెట్టుకున్న మనిషిని ఎలా వెళ్ళి అడగటం అని వూరుకుంది. యిక భర్త వచ్చేదాక అలావుండాల్సిందే.

రాజమ్మ పిన్నిగారైనా యింతదాక వచ్చింది కాదు. అటునుంచిఅటే యింటికెళ్ళిపోయింది.

అన్నీ తనకు సమస్యలుగానే ఎదురౌతాయి. ఆయాచితంగా అనుభవించిన కాస్తసంతోషం దానివెనకాల సిద్ధంగావున్న దుఃఖవాహినిలో కొట్టుకుపోతుంది.

'అమ్మగారూ' అన్న కేకతో ఆలోచిస్తున్న అన్నపూర్ణ యీలోకంలోకి వచ్చింది.

"అయ్యగారు యీ ఫైళ్ళు యింట్లో పెట్టి రమ్మన్నారండీ! అయ్యగారు సినీమాకి వెళతారటండి. ఆలస్యంగా వస్తానని చెప్పమన్నారండి" అంటూ పాఠం అప్పజెప్పినట్లు ఆఫీసు జవాను అప్పన్న చెప్పి ముగించాడు.

"హతోస్మి. ఈయనకూడా నేడే సినిమాకి వెళ్ళాలా" అనుకుని, "చూడు అప్పన్నా! నాని బాబుకి జ్వరంగా ఉంది. డాక్టరు దగ్గరకు తీసుకెళ్ళాలి, అందుకని అయ్యగార్ని త్వరగా ఇంటికి రమ్మన్నానని చెప్పు" అంటూ చెప్పి, సత్ఫలితానికి ఆశపెట్టుకుంది అన్నపూర్ణ.

"అలాగేనండీ" అంటూ సాగదీసి, సాగిపోయాడు అప్పన్న.

నాని చలికి వణుకుతుంటే వాడికి దుప్పటి కప్పి. మిగతా పిల్లలకి యింత టిఫిన్లైనా పోద్దామనే నెపంతో వంటింట్లోకి దారితీసింది అన్నపూర్ణ.

ఇదివరకు తాను చదువుకునే రోజుల్లో బొమ్మ స్వీటూ, హాటూ రెండూ తయారుచేసి, తనకు రాగానే టిఫిను ప్లేటు అంది

చ్చేది. కానీ తనీనాడు తన పిల్లలకి నాలుగు రోజుల కొకసారి గాని టిఫిను పెట్టలేక పోతుంది. తన పిల్లల దురదృష్టానికి యీ కాలం యిలా మారిందని ఆమె మనసు కలత చెందింది. ఇంకోటి కూడా తట్టింది అన్నపూర్ణకి. వీళ్లందరికి పెళ్లిళ్ల చేయకుండా అలా వదిలేస్తే, ఎవరికి వారు హాయిగా ఏ యిబ్బందీ లేకుండా వుండగలరేమో! పెళ్లాం, పిల్లల్ని మెడకి కడితే, కాలం పోయే పోకడలో, వాళ్ళకి గంజినీళ్లకు కూడ కరువై పోతుందేమోనని అనిపించింది.

సాయంత్రం అరవగానే, అన్నపూర్ణ భర్త మాధవరావు, యింటికొచ్చాడు తన మాటలు లెఖ్ఖచేసి, సినిమా మానుకుని యింటికి వచ్చిన భర్తని కృతజ్ఞతతో చూసింది అన్నపూర్ణ.


''సారీ అండి. మీరు సినిమాకి వెళ్లకుండా చేశాను'' అంది పశ్చాత్తాపంతో.

''మరేం ఫరవాలేదు పూర్ణా. ఏదో రావాల్సి వుండి నాలుగు డబ్బులు చేతికి రాగానే, అందరూ నా చుట్టూ చేరి, సినిమా కని గోలపెట్టారు. కాదనలేక సరే అన్నాను. కానీ నీ కబురు రాగానే డ్రాప్ చేసుకున్నాము. ఎలావుంది నానికి?'' అంటూ బాధ్యత వున్న మగనిగానే అడిగాడు మాధవరావు.

బాబుని డాక్టరు దగ్గర తీసుకెళ్లి ఏవో మందులు, టానిక్కు - ఆయన వ్రాసిచ్చిన ప్రకారం తీసుకొచ్చాడు మాధవరావు. అంతా కలిసి అటు, యిటుగా ఓ యిరవై రూపాయలు వదిలాయి. అన్నపూర్ణ ప్రాణం వుసూరుమంది. చేతికి డబ్బు వచ్చిందని, యీ రోగాలకి కూడా తెలుస్తాయి కాబోలు! పిలిచినట్లు వస్తాయి!

అనుకోని డబ్బు వచ్చింది కదా, ఏదో కోరిన వస్తువు కొనుక్కుందామని లేక, యిలాగ మందులూ మాకులూ. వుప్పు పప్పు కనీ, స్కూలు ఫీజులనీ, బాకీలు చెల్లింపనీ – డబ్బంతా హారతి కర్పూరమై పోతుంది.

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్సా
విరేపనముతో
చికిత్సను పొందండి
– శస్త్రచికిత్స
అవసరములేదు!



**40 సం॥ అనుభవం**

వరిబీజము బుడ్డలు బీజకుట్టు

మొదలగు వ్యాధులకు ఆపరేషన్

లేకుండా గ్యారంటిగా బాగుచేయబడును

వివరములకు:




గౌలిగూడ నయబస్ డిపో ఎదుట,

బాలాజీలాడ్జింగ్ ప్రక్కన, హైద్రాబాద్-12.

ఆఫీస్‌ఫోన్: 42870, ఇంటిఫోన్: 38544








**మీకు సంతానం లేదా ?**



ఆపరేషన్, యితర వైద్య చికిత్సలచే నిరాశ చెందిన సోదరీమణు లనేకులు మా సలహాలచే సంతాన వంతులయి యిచ్చిన యోగ్యతా పత్రములు గలవు. స్త్రీ పురుష వంధ్యాదోష నివారణ నిపుణులు.

ఉచిత వివరములకు

**శ్రీ నాగార్జున మూలిక కుటీరం**

రైల్వేస్టేషన్ వద్ద, రామాలయం వీధి,

తెనాలి - 2.


## ఇల్లాలు—అన్నపూర్ణ

అన్నపూర్ణ ఆలోచనల నుంచి, యింకా తేరుకోనేలేదు. పధ్నాలుగేళ్ల రాధ, "అమ్మా, అమ్మా" అంటూ అరవటం మొదలెట్టింది.

"పరీక్షలకి చదువుకోవాలని ఆ గదిలో వేరేగా లైటు పెట్టుకుని కూర్చుంది కదా, హాయిగా చదువుకోకుండా దీనికేమొచ్చింది" అని ఆకూతురిమీద విసుక్కుంటూ వెళ్లింది.

"ఏమిటే రాధా, కాస్త పడుకోనీయకుండా అలా 'అమ్మా అమ్మా' అంటూ నీ కేకలు!" అని మేను మరచి నిద్ర రాకపోయినా, మేను వాల్చిన సుఖము యిప్పుడు తెలిసినట్టు చిరాకు పడింది అన్నపూర్ణ.

రాధ భయపడినదానికిమల్లే తల్లి చెవిలో ఏదో గుసగుస చెప్పింది.

అది విన్న అన్నపూర్ణ నిలువుగుడ్లేసింది.

"ఉండేది చాలక యిదికూడానా తల్లీ! రేపటినుంచి మరో క్రొత్త సమస్య. సరే వస్తానుండు" అంటూ కర్తవ్య నిర్వహణకి నడుము కట్టక తప్పింది కాదు ఆ యిల్లాలికి.

అలిసిపోయి హాయిగా పెద్దగా గుర్రు పెట్టి నిద్రపోతున్న భర్తకి "అమ్మాయి పెద్దదైం"దని చెప్పి నిద్రాభంగం కలిగించటం యిష్టంలేక ఆ పని మరునాటి ప్రొద్దుటికి వాయిదా వేసింది.

అంతలో గడియారం పన్నెండు గంటలు కొట్టింది.

ఇల్లు, సంసారం, పిల్లలూ — యీ సమస్యలతో నిద్ర రాలేదని బాధపడటం మానేసి, యిక 'నిద్ర' అనే పదాన్ని పూర్తిగా మార్చిపోవాలని నిశ్చయించుకుంది—యిల్లాలు అన్నపూర్ణ.

## ఫాలాక్షుని డైరీ

### వాయిదాపడిన ఉరి

"ఉరికంబం" శిక్ష పడిన వో ఖయిదీ తన కళ్లను, మూత్రపిండాలను, చర్మాన్ని— వెయ్యేల!! తన శరీరంలో పనికి వచ్చే ప్రతి భాగాన్నీ ఆ భాగం అవసరమున్న వారికివ్వాలన్న తన అభిప్రాయం వెల్లడించాడట. మహారాష్ట్రకు చెందిన హమీద్ దాల్వాయి అనే వో ప్రముఖ సంఘ సంస్కర్త మూత్రపిండాల చికిత్స పొందుతున్నాడట. ఆయన కొకవేళ యీ ఖయిదీ మూత్రపిండాలు పనికి వస్తాయేమోనని వైద్య నిపుణులు చూస్తున్నారట. ఈ విషయాలు బొంబాయి ముఖ్యమంత్రి చవన్ విలేఖరులతో అన్నారట. ఇంతకూ అభినవదాన కర్ణుడైన ఆ ఖయిదీ పేరెక్కడా చెప్పినట్టు లేనట్టుంది.

### ప్రసాదంపేరున విషప్రయోగం

దక్షిణ ఆర్కాటు జిల్లాలోని వో గ్రామవాసికి తిరుపతి ప్రసాదం అంటూ పోస్టులో ఒకపార్సిలు వచ్చిందట. అది విప్పి చూస్తే అందులో లడ్డూలున్నాయట. ఆయన, ఆయన కుటుంబానికే గాక, ఆ ప్రసాదం వూరిలో చాలా మందికి పంచిపెట్టాడట. ఆ ప్రసాదం తిన్న వెంటనే చాలా మంది స్పృహ తప్పి పడిపోయారట. ఆసుపత్రిలో చేరిన వారిలో ఏడుగురు చికిత్స పూర్వమే చనిపోయారట. ఇంకా 37 మంది చికిత్సలో "ఇదమిద్ధం" తేలని స్థితిలో వున్నారట. ఈ పార్సిలు మద్రాసు నుంచి వచ్చిందట. ఇంతకూ ఎవరు, ఎందుకు యీ విష ప్రయోగం చేయాల్సివచ్చిందో పోలీసు కూపీ లాగ నారంభించిందట — మరిహనేం!

